ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



యువత వివేకానందుడి అడుగుజాడల్లో నడవాలి 8లో..

వైభవంగా గోదాదేవి రంగనాయకుల కల్యాణం 7లో..



నామినేటెడ్ పదవుల భర్తీపై సర్కారు దృష్టి

- ఇప్పటికే గ్రంథాలయ సంస్థ పాలకవర్గం రద్దు
- అదే దారిలో మార్కెట్ కమిటీ పాలకవర్గాలు
- దేవాదాయ, ధర్మాదాయ, ఇతర శాఖల్లోనూ భర్తీకానున్న పోస్టులు
- సర్కారు పెద్దల చుట్టూ చోటా మోటా నేతల ప్రదక్షిణలు

జగిత్యాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలంగా అధికారంలో లేక పదవులు పొందలేక, పనులు చేసుకోలేక అవస్థలు పడ్డ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ సారి రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఎన్నో ఆశలు పెంచుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అందుకు తగ్గట్టే అధి కారం చేపట్టిన నెల రోజుల్లో నామినేటెడ్ పదవుల భర్తీ దృష్టి సారించారు. ఇప్పటికే వివిధ సంస్థలు, కార్పొరేషన్ల పాలక వర్గాలను రద్దు చేస్తూ ప్ర భుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీల పాలక వర్గాలను కూడా రద్దు చేస్తున్నామని ఇటీవల సీఎం ప్రకటించారు. దీంతో కొత్తవా రి తో ఆయా పదవులను భర్తీ చేయడానికి మార్గం సుగమమైంది.

● ఆలయాలకు సైతం కమిటీలు...

జిల్లాలోని పలు ఆలయాలకు కమిటీలను నామినేట్ చేస్తారు. చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు ఉంటారు. జిల్లాలో ప్రధానంగా ధర్మపురి లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం, మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయ దేవస్థానం, సారంగపూర్ మండలం పెంబెట్ల రాజరాజేశ్వరస్వామి దేవస్థానం, ఇబ్రహీం పట్నం మండలం గండి హనుమాన్ దేవస్థానం, మల్లాపూర్ మండలం వాల్గొండ రామలింగేశ్వర స్వామి ఆలయం, మల్లాపూర్ కనకసోమేశ్వర స్వామి ఆలయం, కోరుట్ల సాయిబాబా ఆలయంలతో పాటు ఇతర ఆల యాలకు సైతం నామినేటెడ్ పదవులను కేటాయించనున్నారు.

పార్టీలో సీనియర్ నేతలను రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ చైర్మన్‌లుగా, డైరెక్టర్లుగా నియమించే అవకాశాలున్నాయి. అలాగే ద్వితీయ శ్రేణి నేతలను జిల్లా, ని యోజకవర్గ స్థాయి లోని వివిధ సంస్థల్లో నామినేట్ చేయనున్నారు. జిల్లా లో గ్రంథాలయ సంస్థ అలాగే పదమూడు వ్యవసాయ మార్కెట్ కమిటీ లు ఉన్నాయి. గ్రంథాలయ సంస్థ చైర్మన్‌తో పాటు సభ్యులను నామినేట్ చేస్తారు. అలాగే మార్కెట్ కమిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లను నియమిస్తారు. వీటితో పాటు జిల్లాలోని ఆయా దేవాలయాల అభివృద్ధి కమిటీలకు సంబంధించి పదవులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. దీంతో కాం గ్రెస్ నేతల్లో ఆశలు పెరిగాయి.

● కాంగ్రెస్ ఎమ్మెల్యేలు...ఎమ్మెల్సీ ఆశీస్సులుంటేనే...

జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆశీస్సులుంటేనే నామినేటెడ్ పదవులు దక్కే అవ కాశాలున్నాయి. ఆయా నామినేటెడ్ పదవులపై కన్నేసిన నేతలు ఎమ్మెల్యే లు, నాయకులను కలిసి తమకు అవకాశం ఇప్పించాలని విన్నవించుకుంటున్నా రు. జిల్లాలో కేవలం ధర్మపురి నియోజక వర్గంలో మాత్రమే కాంగ్రె స్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఉన్నారు. చొప్పదండి, వేములవాడ నియోజక వర్గాల్లో సైతం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిత్యం వహిస్తున్నారు. మిగిలిన జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిత్యం వహిస్తున్నారు. జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జి సెగ్మెంట్ ఇన్‌చార్జిలు ప్రతిపాదించిన వారికి నామినేటెడ్ పదవులు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. నామినేటెడ్ పదవులు ధర్మపురిలో ఎమ్మెల్యే విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాలలో ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, కోరుట్లలో పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్ రావులు ప్రతిపాదించిన వారినే నియమించే అవకాశం ఉంటుంది. కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్యనేతల సూచనల మేరకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టనున్నారు. పార్లమెంటు ఎన్నికల్లోపు నామినేటెడ్ పదవులు పంచడం ద్వారా ఎన్నికల్లో మరింత కష్టపడతారని ఆ పార్టీ నాయకత్వం భావిస్తోంది. కొందరికి నామినేటెడ్ పదవులు ఇవ్వగా, మిగిలిన వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కల్పించనున్నారు.

● ప్రయత్నాలు షురూ....

నామినేటెడ్ పదవుల భర్తీకి సంబంధించిన ప్రక్రియ త్వరలో మొదలు కానుంది. దీంతో ఆశావహులు ప్రయత్నాలు షురూ చేశారు. జగిత్యాల, కో రుట్ల, ధర్మపురి నియోజకవర్గాలతో పాటు చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని మల్యాల, కొడిమ్యాల, వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాల్లో కాంగ్రెస్ పార్టీలో ఏళ్ల తర బడిగా పనిచేస్తున్న చాలామంది సీనియర్లు తమకు అవకాశం దొరుకుతుందనే ఆశతో ఉన్నారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన వాళ్లంతా ఇప్పుడు తమకు పదవులు ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మె ల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ల ద్వారా పదవుల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. వారి అనుగ్రహం కోసం పలువురు చోటా మోటా నేతలు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతి నిధుల సహకారంతో పదవులు పొందాలని కొందరు ప్రయత్నాలు చేస్తు న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ భర్తీ ప్రక్రియ చేపడితే పదవులు ఎవరిని వరిస్తాయో వేచిచూడాలి.

● జిల్లాలో పదమూడు మార్కెట్ కమిటీలు...

జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు పదమూడు ఉన్నాయి. ఒక్కో దానిలో చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు మరో పన్నెండు మంది డైరెక్టర్లను నియమించాల్సి ఉంటుంది. అంటే ఒక్కో మార్కెట్ కమిటీలో పద్నాలుగు మందికి అవకాశం దక్కుతుంది. జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో జగిత్యాల, రాయికల్ మార్కెట్ కమిటీలు, కోరుట్ల నియోజకవర్గంలో కోరుట్ల, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ఏఎంసీలు, ధర్మపురి నియోజక వర్గంలో ధర్మపురి, గొల్లపల్లి, పెగడపల్లి, వెల్గటూరు మార్కెట్ కమిటీలున్నాయి. వేములవాడ నియోజకవర్గం పరిధిలో మేడిపల్లి, కథలాపూర్ కమిటీలు, కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజక వర్గం పరిధిలో మల్యాల, కొడిమ్యాల మార్కెట్ కమిటీల చైర్మన్, వైస్ చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్లను నియమిస్తారు.

జిల్లాలో సీఐల బదిలీలు

జగిత్యాల టౌన్, జనవరి 12: జిల్లాలోని పలువురు సీఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు మల్టీ జోన్-2 ఐజీ తరుణ్‌జోషీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగజ్‌నగర్ సీఐగా పని చేస్తున్న బుడ్డె స్వామి జగిత్యాల టౌన్, ఎస్‌హెచ్‌వోగా, జగిత్యాల టౌన్ సీఐ సీహెచ్ నటేష్ ఐజీ కార్యాలయానికి అటాచ్, జగిత్యాల డీఎస్పీ కదిర నాగేశ్వర్‌రావు మల్యాలకు, మల్యాల సీఐగా పని చేస్తున్న బిళ్ల కోటేశ్వర్ సీఎస్‌బీ-2 కరీంనగర్‌కు, జగిత్యాల సీసీఎస్‌గా ఉన్న జి వెంకటేశ్వర్లు జగిత్యాల డీఎస్‌బీగా, మంథని సీఐగా ఉన్న జి సతీష్‌ను ధర్మపురికి, ధర్మపురి సీఐ డి రమణామూర్తిని ఐజీ కార్యాలయానికి, జగిత్యాల డీసీఆర్‌బీ డి రాజారెడ్డిని భైంసాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వైభవంగా గోదా రంగనాయకుల కల్యాణం

జగిత్యాల టౌన్, జనవరి 12 : జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువు సమీపంలో ఉన్న శ్రీ సూర్యనారాయణ ధనలక్ష్మి సహిత ధన్వంతరీ దేవాలయంలో శుక్రవారం వేద బ్రాహ్మణులు ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోదాదేవి రంగనాయకుల స్వామి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం మహిళలు సామూహిక విష్ణు పారాయణాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కళ్యాణాన్ని తిలకించి కుంకుమ పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారలకు భక్తులు 108 గంగాళాల్లో నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్తెపు శంకర్, రాజేందర్, ధనుంజయ, రామచంద్రం ఉన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

కొడిమ్యాల, జనవరి 12 : మండలంలోని రాంసాగర్, డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామాలలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో బాగంగా అధికారులు ప్రజలకు అవగాహన కలిపించారు. అంతక ముందు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఆయా గ్రామాల సర్పంచులు మాధవిగంగారావు, రాదగౌతంరెడ్డి, కార్యదర్శులు, ఎంపీటీసీ జగన్‌మొహన్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి



అలిశెట్టి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, జడ్పీ చైర్ పర్సన్

జగిత్యాల టౌన్, జనవరి 12: జిల్లా కేంద్రంలోని అంగడిబజార్‌లో ఉన్న అలిశెట్టి విగ్రహం వద్ద అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జడ్పీచైర్ పర్సన్ దావ వసంత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్ హాజరై ప్రభాకర్ విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభాకర్ సాహిత్యం సమాజహితాన్ని కోరిందని, సమాజ రుగ్మతలు రూపుమాపడానికి అతని అక్షరాలు దోహదం చేసిందన్నారు. జననం, మరణం ఒకే రోజు కావడం ఇది మహానుభావులకే చెందుతుందన్నారు. ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ గోళి శ్రీనివాస్, కౌన్సిలర్ అడువాల జ్యోతి లక్ష్మణ్, పద్మశాలి సంఘం సభ్యులు, ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు. అలాగే బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించి ప్రభాకర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ముసిపట్ల లక్ష్మినారాయణ ఉన్నారు.

గొల్లపల్లి: గొల్లపల్లి మండల కేంద్రంలో స్వర్గీయ అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి వేడుకలను శుక్రవారం పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అలిశెట్టి చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అధ్యక్షుడు చౌటపెల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శి అందె లక్ష్మణ్, కోశాధికారి అంకం లింబాద్రి, ఉపాధ్యక్షుడు శంకర్, గౌరవ అధ్యక్షులు గాజెంగి సత్తయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

మల్యాల, జనవరి 12: మండలంలోని రాజారం వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఇదే గ్రామానికి చెందిన గుర్రం లింగం అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెలుతుండగా రాజధాని బస్సు ఢీకొంది. దీంతో లింగంకు తీవ్ర గాయాలు కాగ చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

మార్కెట్‌లో సంక్రాంతి సందడి..

- ప్రత్యేకంగా వెలిసిన దుకాణాలు
- బిజీగా మారిన పూజా సామగ్రి కేంద్రాలు

జగిత్యాల టౌన్, జనవరి 12: మార్కెట్‌లో సంక్రాంతి సందడి నెలకొంది. సంక్రాంతి పండుగ కోసం ప్రత్యేకంగా వెలసిన దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి పండుగ సమీపిస్తుండటంతో మహిళలు పెద్ద ఎత్తున పూజా సామగ్రి కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. ఈ నెల 15న సంక్రాంతి పండుగ ఉండటంతో ఎక్కువ మంది మహిళలు ఇందుకోసం ప్రత్యేకంగా 13 రకాల పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. ఈ నెల 12 నుంచి 17 వరకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులను ఇచ్చింది. 14 వ తేదీ బోగీ, 15వ తేదీ సంక్రాంతి ఉండటంతో ఉద్యోగులు, ఉన్నత విద్య కోసం వెళ్లిన యువతీ, యువకులు ఇప్పటికే ఇంటికి చేరుకుని పండుగ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సంక్రాంతి పండుగ కోసం పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. మహిళలు సంక్రాంతి పండుగ రోజు నోములు చేసుకోవటం ఆన వాయితీ కాగా.. అందుకు కావాల్సిన పూజా సామగ్రి కొనుగోలులో మహిళలు బిజీగా మారారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్, కొండగట్టు ప్రాంతాలలో వెలసిన ప్రత్యేక దుకాణాలు మహిళలతో కిటకిటలాడుతున్నాయి.



పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న మహిళలు

నోముల కోసం పూజా సామగ్రి

సంక్రాంతి పండుగ రోజు ప్రత్యేక పూజలు చేసుకోవటం ఆనవాయితీగా వస్తుంది. భర్త, పిల్లలు బాగుండాలని మహిళలు ప్రత్యేకంగా నోములు చేస్తుంటారు. కొత్త దంపతులు 13 రకాల వస్తువులతో పూజలు చేస్తుంటారు. ఇందుకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. గతంలో కంటే ప్రస్తుతం ధరలు రెండు రెట్లు పెరిగాయి. ప్రత్యేక పూజల కోసం దేవుళ్ల విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. సంక్రాంతి పర్వదినాన ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేసేందుకు మహిళలు వివిధ రకాల రంగులను ఇప్పటి నుంచే కొనుగోలు చేస్తున్నారు.

కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దు

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, జనవరి 12: ఎన్నికల్లో గెలుపు ఓటములు సర్వ సాధారణమని, ఓటమిని చూసి కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు. శుక్రవారం మండలంలోని కిషన్‌రావుపేట శ్రీ నాగవల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద ఉమ్మడి వెల్గటూర్ మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపోటములు, రాజీనామాలు బీఆర్ఎస్ పార్టీకి కొత్త కాదని కార్యకర్తలు నిబ్బరంగా ఉండాలన్నారు. మంచి ప్రభుత్వాన్ని పోగొట్టుకున్నామనే భావన ప్రజల్లో ప్రారంభమైందని తెలిపారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది కలిగించాలని చూసినా చూస్తూ ఊరుకోమని, బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడితే వారికి అండగా ఉండేలా లీగల్ సెల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ప్రతికూల ఫలితాలకు గల కారణాలు తెలుసుకొని రాబోయే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి, ఏలేటి కృష్ణారెడ్డి, జూపాకకుమార్, గాజుల మల్లేశం, తిరుపతి, రియాజ్, పొడేటి రవి, జగదీశ్వర్, జలంధర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి మెతు కుస్వామి, చుంచు మల్లేష్ పాల్గొన్నారు.

సీఎంకు ప్రభుత్వ విప్ అడ్లూరి కృతజ్ఞతలు



సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న అడ్లూరి

ధర్మపురి, జనవరి 12: ధర్మపురి నియోజకవర్గానికి రూ 10 కోట్లు నిదులు మంజూరు చేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిసి నిధులు మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో తాగు నీరు, సాగు నీరు సమస్య లేకుండా చూడాలని ఆయన కోరారు. ధర్మపురిని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసి, నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెవెళ్లారు. స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి స్థాయిలో సహకారం అంది స్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

● ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గోదావరి లిఫ్ట్ ద్వారా సాగు నీరు అందించేలా కృషి చేసిన ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. తిమ్మాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ కమిటీ చైర్మన్ వావిలాల ప్రకాష్, ఎంపీటీసీ కాళ్ల సత్తయ్య, తిమ్మాపూర్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ నలుమాసు వైకుంఠం, లింగాల హరీష్‌గౌడ్, తోడేటి ప్రకాష్, తిరుపతి, లచ్చన్న, సంతోష్, రాజనర్సు పాల్గొన్నారు.

● మండలంలోని కమలాపూర్ ఫిల్టర్ బెడ్ మరమ్మతు పనులు పూర్తి చేశారు. దీంతో కొంత కాలం నుంచి నెలకొన్న సమస్య పరిష్కారం కావడం వల్ల పట్టణ ప్రజలకు తాగు నీరు సరఫరా చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఇటీవల సంబంధిత శాఖ అధికారులతో చర్చించి, తగిన సూచనలు అందించారు. వెంటనే అధికారులు ఫిల్టర్ బెడ్ మరమ్మతు పనులు చేసి పట్టణ ప్రజలకు తాగు నీరు సర ఫరా చేస్తున్నారు.

ధర్మపురిలో 18 నుంచి వేద పారాయణం

ధర్మపురి, జనవరి 12: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవ స్థానం ఆవరణలో హైదరాబాద్ శ్రీ ప్రేమికవరద, వేదపరిపాలన సభ ఆధ్వర్యంలో జనవరి 18 నుంచి 24 వరకు వేదపారాయణం, వేదహవనం జరుగుతుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, లోక కళ్యాణం కోసం సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పించిన సందర్భంగా ధర్మపురి పీఠాధిపతి సచ్చితానంద సరస్వతి స్వామి దివ్య ఆశీస్సులతో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాలతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందు కోసం ఉమ్మడి జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచనలతో ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గతంలో మంగళగిరి, వేదాద్రి, సింహాచలం తదితర నరసింహ క్షేత్రంలో చేసిన విధంగా 21 మంది వేదపండితులచే సప్తాహ్నిక దీక్షగా వేదపారాయణం, హవనం చేసేందుకు ఆలయం ఆవరణలో తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు, స్థానిక వేదబ్రాహ్మణులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, దాతలు, అర్చకులు, వేదపండితుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని నిర్ణయించి నట్లు ఆయన తెలిపారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ప్రముఖ జ్యోతిష్య పండితులు పాలెపు బద్రీనాథ్‌శర్మ, కేదారేశ్వరశర్మ, వేదపండితులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అర్చకులు, ఈవో

గ్రూప్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్,జనవరి12: కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్1,2,3,4, శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగులు ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో bcstudycircle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులు కులం, ఆదాయం, ఆధార్ కార్డు, పాస్ ఫొటోలతో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.5 లక్షలలోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాల కోసం బీసీ. స్టడీ సర్కిల్ నూతన భవనము, కరీంనగర్ కార్యాలయంలో ఆఫీసు వేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఆటో బోల్తా.. పదిమందికి గాయాలు

మంథనిరూరల్, జనవరి 12: మంథని-ఖమ్మపల్లి ప్రధాన రహదారి గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్ వద్ద శుక్రవారం ఉదయం ఆటో అదుపు తప్పి బోల్తాపడటంతో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ముత్తారం మండలం సీతంపల్లికి చెందిన నూనేటి రామయ్య తన ఆటోలో భూపాలపల్లి జిల్లా తాడిచర్ల నుంచ ప్రయాణికులకు తీసుకొని మంథని వైపు వస్తుండగా ఆటో అదుపు తప్పడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ రామయ్యతో పాటు ప్రయాణిస్తున్న 10 మందికి తీవ్ర గాయాలు కాగావారిని చికిత్స కోసం మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో ఎడుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్, గోదావరిఖనికి తరలించారు.

ఎన్టీపీసీలో రోడ్డు ప్రమాదం

జ్యోతినగర్, జనవరి 12: ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. మేడిపల్లి సెంటర్ ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ వద్ద బుల్లెట్, మరో బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో మంచిర్యాల జిల్లా మందమర్రి(జీలకుంట)కి చెందిన మొలిశెట్టి మహేందర్, ఎల్కలపల్లికి చెందిన అతుకుల సాయిరాం, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన ముగ్గురిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరు చోట్ల చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

వెల్గటూర్, జనవరి 12: జగిత్యాల జిల్లాలో వేర్వేరు చోట్ల చికిత్స పొందుతూ శుక్రవారం ఇద్దరు మృతి చెందారు. వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన గట్ల లచ్చయ్య (62) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం మృతుడు లచ్చయ్య కొద్ది రోజుల క్రితం అయ్యప్ప మాల వేసుకున్నాడు. ఈ నెల 7న వెల్గటూర్‌లో గౌరి వెంకట చైతన్య ఏర్పాటు చేసిన అల్పాహారానికి వెళ్లిన లచ్చయ్య మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. ఈ సంఘటనలో తలకు తీవ్ర గాయాలు కాగా జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామ సమీపంలో కల్వర్టు పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడిన కండ్లె కృష్ణ (38) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ దత్తాత్రి కథనం ప్రకారం బుగ్గారం మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ తన భార్య గంగజలతో కలిసి జీవనోపాధి నిమిత్తం తుమ్మెనాల తల్లి ఇంటికి వచ్చారు. అక్కడే సమీపంలో గల గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్నాడు. కృష్ణ మూర్ఛతో బాధ పడుతున్నాడు. ఈ నెల 1న నేరెళ్ల సమీపంలో గల కల్వర్టుపైన కూర్చొని ఉండగా హఠాత్తుగా కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయనను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలను విడగొట్టి ఘర్షణలు సృష్టిస్తున్న బీజేపీ

- రాజకీయం కోసమే అయోధ్య రామమందిర నిర్మాణం

- మావోయిస్టు రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ లేఖ

హుజూరాబాద్, జనవరి 12: సామాజిక రాజకీయ ఆర్థిక ప్రయోజనాల కోసం బీజేపీ భారత ప్రజలను మతాలుగా విడగొట్టి ఘర్షణలు సృష్టిస్తోందని తెలంగాణ మావోయిస్టు రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరిట శుక్రవారం ఒక ప్రకటన వెలువడింది. రాజకీయ దురుద్దేశ్యంతోనే ఆర్ఎస్ఎస్, బీజేపీ అయోధ్య రామమందిర నిర్మాణం చేపట్టిందన్నారు. 500ఏళ్ల కిందట ముస్లింలు పవిత్రంగా విశ్వసించే బాబ్రీ మసీద్‌ను నిర్మించుకొని వాళ్ల విశ్వాసాల ప్రకారం ప్రార్థనలు చేస్తూ వస్తున్నారన్నారు. కానీ రాముడు జన్మించిన స్థలం అంటూ కట్టు కథలు సృష్టించి ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని బ్రాహ్మణీయ, హిందుత్వ పాసిస్టు సంస్థలు 1992, డిసెంబరు 6న బాబ్రీ మసీద్‌ను బలవంతంగా కూల్చి వేశారన్నారు. 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆర్ఎస్ఎస్ మార్గదర్శకత్వంలో సుప్రీంకోర్టులో చారిత్రాత్మక వాస్తవాలను కప్పి పుచ్చి తీర్పు ఇప్పించారన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ దేశంలో 2024 సాధారణ ఎన్నికల్లో మూడో విడత అధికారాన్ని చేపట్టడానికి రామమందిరాన్ని వాడుకుంటున్నారన్నారు. 2047నాటికి పరిపూర్ణ హిందుత్వ రాజ్యంగా మార్చాలనే ప్రధాన లక్ష్యంతో బీజేపీ ముందుకెళ్తుందన్నారు. మతతత్వ రామమందిర ఆవిష్కరణను ప్రజలు వ్యతిరేకించాలని లేఖలో పేర్కొన్నారు.

17క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- రైస్‌మిల్లులో సివిల్ సప్లయి అధికారుల తనిఖీలు
- యజమానిపై ఆగ్రహం

ఇల్లందకుంట, జనవరి 12: అక్రమంగా తరలిస్తున్న 17క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఇల్లందకుంట పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన లింగారెడ్డి అనే వ్యక్తి ఉదయం ఎడ్లబండిపై కొత్తపల్లి నుంచి ఇల్లందకుంట వైపు తీసుకు వస్తుండగా గమనించిన పోలీసులు దాన్ని వెంబడించారు. ఆ ఎడ్లబండి ఇల్లందకుంటలోని సీతారామాంజనేయ రైస్‌మిల్‌లోకి చేరింది. ఎస్సై రాజకుమార్ వెంటనే సివిల్ సప్లయి అధికారులకు సమాచారం అందించారు. ఉన్నతాధికారులు, రాష్ట్ర సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ (ఓఎస్‌డీ) అధికారుల బృందం మిల్లుకు వచ్చి తనిఖీలు నిర్వహించారు. మిల్లు యజమాని అందుబాటులో లేకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లులో స్టాక్ రిజిస్టర్, స్టాంపులు కూడా సరిగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సదరు మిల్లు యజమాని 2021-22 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన 10 లారీల వడ్లు పట్టించి బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. కాగా ఇప్పటి వరకు పంపించకపోవడంపై మిల్లులో ప్రభుత్వానికి సంబంధించిన వడ్లు లేకపోవడంపై మండిపడ్డారు. 2022-23 సంబంధించిన బియ్యం కూడా ప్రభుత్వానికి అప్పగించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంపించిన బియ్యం కూడా క్వాలిటీగా లేవని, నెల రోజుల్లోగా ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యం పంపించాలని చెప్పారు. లేని యెడల మిల్‌ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. గతంలో పంపించిన 290 క్వింటాళ్ల బియ్యాన్ని కూడా వాపస్ పంపిస్తే అవి కూడా మిల్లులో లేకపోవడంపై మండిపడ్డారు. ప్రస్తుతం ఉన్న బియ్యాన్ని నమూనాలు సేకరించి ల్యాబ్ పంపిస్తామని చెప్పారు. అందులో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు రిపోర్టు రాస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయి ఓఎస్‌డీ ప్రభాకర్, సివిల్ సప్లయా ఎన్‌ఫోర్స్ మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు, డీఎం రజినీకాంత్, డీసీఎస్‌వో సురేష్‌రెడ్డి, డీటీసీ, ఎస్ఐ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో కూడారై ఉత్సవం



వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కోరుట్ల, జనవరి 12 : పట్టణంలో అతిపురాతనమైన శ్రీవెంకటేశ్వరస్వామి సన్నిధిలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కూడారై ఉత్సవం (ఇత్తడి గంగాళంలో ప్రసాదం) ఘనంగా జరిగింది. అదేవిధంగా తిరుప్పావై ఉత్సవం అర్చనలు, అభిషేకాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బీర్నంది నరసింహాచారి, ఈఓ విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, అండాల్ గోష్టి బృందం పాల్గొన్నారు.

జమ్మికుంట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీవేంకటేశ్వస్వామి ఆలయంలో శుక్రవారం కూడారై ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష తులసి కుంకుమార్చన చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ముక్క జితేందర్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

'ఖని'లో ట్రక్కు బీభత్సం

- బస్టాండ్ వద్ద ట్రాలీని ఢీకొట్టి హోటల్‌లోకి..
- ట్రాలీ, ద్విచక్ర వాహనం ధ్వంసం
- ఒకరికి స్వల్ప గాయాలు



ట్రాలీని ఢీకొట్టిన ట్రక్కు

కోల్‌సిటీ, జనవరి 12: గోదావరిఖనిలో శుక్రవారం తెల్లవారు జామున ట్రక్కు బీభత్సం సృష్టించింది. హైదరాబాద్ నుంచి కూల్ డ్రింక్స్ లోడ్‌తో కాగజ్‌నగర్‌కు వెళుతున్న ట్రక్కు (టీఎస్07యూపీ0198) గోదావరిఖని బస్టాండ్ వద్ద అదుపు తప్పి మున్సిపల్ చెత్త ట్రాలీని ఢీకొట్టింది. అక్కడే టీ స్టాళ్ల వద్ద ఉన్న ప్రజలు అప్రమత్తమయ్యారు. శబ్దంతో లోపలికి పరుగులు తీశారు. ఆటో ట్రాలీని తోసుకుంటూ వేగంగా ట్రక్కు బస్టాండ్ ముందున్న టీ స్టాల్‌లోకి దూసుకుపోయింది. మున్సిపల్ ఆటో డ్రైవర్ ట్రాలీలోనే ఉన్నాడు. ఆటో ట్రాలీ, మరో మోపెడ్, సైకిల్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ట్రాలీ డ్రైవర్ మున్సిపల్ కార్మికుడు రమేష్ ట్రాలీలోనే చిక్కుకోవడంతో స్థానికులు అతన్ని బయటకు తీశారు. స్వల్ప గాయలతో అతను బయట పడ్డాడు. ఈ ఘటనతో భయకంపితులై ప్రయాణికులు పరుగు పెట్టారు. డ్రైవర్‌ను ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ స్వామి, ఏఎస్ఐ మల్లయ్య, ట్రాఫిక్ ఎస్ఐ ఉదయ్‌కిరణ్‌లు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మేయర్ బంగి అనీల్ కుమార్, కమిషనర్ నాగేశ్వర్, కార్పొరేటర్ మహంకాళి స్వామి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటన స్థలాన్ని కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బాల రాజ్‌కుమార్, నాయకులు కాల్వ శ్రీనివాస్, పీచర శ్రీనివాస్ పరిశీలించారు.

ఎన్టీపీసీలో ఉమ్మడి జిల్లా రోలర్ స్కేటింగ్ పోటీలు

జ్యోతినగర్, జనవరి 12: ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లో శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా రోలర్ స్కేటింగ్ పోటీలు జరిగాయి. పీటీఎస్‌లోని రింక్ కోర్టులో జరిగిన పోటీలను కరీంనగర్ జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దయానంద్ గాంధి, ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి బానేశ్వర్ రావు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన పలువురు చిన్నారులు రోలర్ స్కేటింగ్‌లో పాల్గొన్నారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పిల్లలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, ఎన్టీపీసీ అధికారులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తులు సమర్పించే చీరలకు వేలం

వేములవాడ టౌన్, జనవరి 12: వేమలవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో అమ్మవార్లకు భక్తులు సమర్పించే చీరల వేలం పాటను ఆలయ సమావేశ మందిరంలో ఈవో కృష్ణప్రసాద్ నేతృత్వంలో శుక్రవారం వేలంపాట నిర్వహించారు. టెండర్‌లో భాగంగా ఆన్‌లైన్‌లో మూడు టెండర్లు రాగా, ముగ్గురు కాంట్రాక్టర్లు వేలం పాటకు హాజరయ్యారు. గత వేలం పాటలో ఈ కాంట్రాక్ట్‌ను రూ. 78 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయాధికారులు తెలిపారు. నూతనంగా 2024-26కు గాను టెండర్ నిర్వహించగా స్వామివారి పాటగా రూ. 83 లక్షలతో అధికారులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ శ్రీనివాస్ రూ 95 లక్షల వరకు వేలంపాట పాడి అక్కడికి నిలిచిపోయారు. తరువాత ఆన్‌లైన్ టెండర్లను తెరిచిన అధికారులు సిద్ధార్థ అనే కాంట్రాక్టర్ రూ. కోటి 1 లక్ష 116లకు కోడ్ చేయడంతో టెండర్ సిద్ధార్థ అనే కాంట్రాక్టర్ కు ప్రకటించారు. కరోనా సమయంలో టెండర్‌కు ఇప్పటికి రూ. 18 లక్షల తేడా ఉండటంతో కాంట్రాక్టర్లు పెద్దఎత్తున సిండికేట్ అయినట్లు ఆరోపణలు బాహాటంగానే వినబడుతున్నాయి. అమ్మవారి చీరల వేలం పాట సుమారు ఒక కోటి 30 లక్షల వరకు పలుకుతుందని భావించగా, కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి వేలం పాటను ఒక కోటి ఒక లక్ష రూపాయలకే పరిమితం చేశారని చర్చసాగుతుంది. అధికారుల కనుసైగల్లోనే కాంట్రాక్టర్‌లు సిండికేట్‌గా మారినట్లు ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ. 2 లక్షల వరకు చేతులు మారాయి అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఈవో కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా అనుకున్న టార్గెట్‌ను రీచ్ అయ్యామని, శాఖపరమైన విచారణ చేస్తామని అన్నారు. తిరిగి టెండర్ నిర్వహిస్తే కోటి దాటి మరింత ఆధాయం సమకూరే అవకాశం ఉందని ఆలయ వర్గాల్లో గట్టి వాదనలు వినిపిస్తున్నాయి.



వేలపాటకు హాజరయిన అధికారులు, కాంట్రాక్టర్లు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక జనవరి 12: మండలంలోని ఎలబాక గ్రామ శివారులో మానేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. వేగురుపల్లి సమీపంలోని మానేరు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్ యాజమాని కొమిరె ప్రణయ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక రవాణ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జనవరి 12: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒక వాహనదారుడికి మూడు రోజుల జైలు శిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన 11 మంది వాహనదారులను శుక్రవారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒకరికి మూడు రోజులు జైలుశిక్ష, 2,500 రూపాయల జరిమానా, మరో 10 మంది వాహనదారులకు 18,500 రూపాయల జరిమానా విధించినట్లు ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

బోయినపల్లి, జనవరి 12: మండలంలోని నీలోజిపల్లి గ్రామానికి చెందిన గుండ్ల కనకయ్య (47) ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్ల కనకయ్య కుటుంబం ఉపాధి కోసం కరీంనగర్ పట్టణంలో నివాసం ఉంటున్నారు. కనకయ్య నీలోజిపల్లిలో గతంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. నిర్మాణానికి కొంత మేరకు అప్పు కావడంతో ఉపాధి కోసం కొద్ది నెలలుగా భార్యతో కలిసి కరీంనగర్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో కనకయ్య మద్యానికి బానిస అయ్యాడు. అప్పు తీర్చే మార్గం లేక మనోవేదన చెందుతుండేవాడు. గురువారం కరీంనగర్ నుంచి నీలోజిపల్లికి వచ్చి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత..ఇద్దరి అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి12: కొత్తపల్లి మండల కేంద్రం, రేకుర్తిలలో కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం ఉదయం దాడులు నిర్వహించి గంజాయిని పట్టుకున్నారు. కరీంనగర్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయ భాస్కర్‌రెడ్డి, ఈఎస్ శ్రీనివాసరావు, ఏఇఎస్ తాతాజీల ఆదేశాల మేరకు ఉదయం 10గంటల రేకుర్తి, కొత్తపల్లి గ్రామాలలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా గొల్లపల్లి మండలం నంచెర్లకు చెందిన రంగు వినయ్, కిసాన్‌నగర్‌కు చెందిన యాదగిరిలు గంజాయితో పట్టుబడ్డారు. కొత్తపల్లికి చెందిన ఉపేందర్ పరారీ అయ్యాడు. ఇద్దరు నిందితుల వద్ద 1,726 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. గంజాయికి అలవాటు పడిన ఆరుగురు వియోగదారులను కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో బైండోవర్ కోసం అప్పగించారు. ఈ దాడులలో ఎస్ఐ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు కుమార్ యాదవ్, ఖాసింబి, కమలాకర్, కమలుద్దీన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొడుకు మోసగించాడని సీపీని ఆశ్రయించిన రిటైర్డ్ కార్మికుడు

- కానిస్టేబుల్‌పై కేసు నమోదు

కోల్‌సిటీ, జనవరి 12: గోదావరిఖని టుటౌన్‌లో పని చేస్తున్న అర్నకొండ సదానందం అనే కానిస్టేబుల్‌పై శుక్రవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సింగరేణి రిటైర్డ్ కార్మికుడు అయిన తండ్రికి మాయమాటలు చెప్పి మోసగించి ఆస్తులు తన పేర గిఫ్ట్ డీడ్ చేయించుకున్నాడనే ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. బస్టాండ్ కాలనీలో నివాసముండే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు అర్నకొండ అంజయ్యకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె, పెద్ద కుమారుడు మరణించగా రెండవ కుమారుడు సింగరేణిలో పని చేస్తున్నాడు. మూడవ కుమారుడు సదానందం కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. బస్టాండ్ క్వార్టర్ల సమీపంలో అంజయ్య పేర ఉన్న ఇల్లు, స్వగ్రామం సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూరులోని రెండు ఎకరాల వ్యవసాయ భూమి చిన్న కుమారుడు సదానందం గిఫ్ట్ డీడ్ చేయించుకున్నాడని, తనను నమ్మించి మోసగించి గిఫ్ట్ డీడ్ చేయించుకున్నాడని, అప్పటి నుంచి తనను వేధిస్తున్నట్టు బాధితుడు పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు సదానందంపై ఐపీసీ 420, 384, 506, 24ఆఫ్ మెయింటనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటీజన్ యాక్ట్ 2007 ప్రకారం ఎస్ఐ సమ్మయ్య కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మెట్‌పల్లి రూరల్, జనవరి, 12: మండలంలోని రంగరావుపేట గ్రామానికి చెందిన గంగుల సామిల్(32) అను వ్యక్తి జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానిక చెందిన గంగుల సామిల్ కొంత కాలంగా మానసిక పరిస్థితి బాగలేక ఇంటి వద్దనే ఉంటున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడు సామిల్ తండ్రి గంగుల నరేష్ ఫిర్యాదు మేరకు కేసు ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలు తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చేరాలు

జమ్మికుంట, జనవరి 12: సాంకేతిక నైపుణ్యాన్ని వ్యవసాయంలో ఉపయోగించి నూతన ఆవిష్కరణలు తీసుకు వచ్చి రైతులకు వివరించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మాజీ సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సి చేరాలు అన్నారు. పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో శుక్రవారం మల్లారెడ్డి యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులు, కేవీకే శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో జాతీయ యువత దినోత్సవం, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను రైతులకు సులభ రీతిలో అర్థం చేయించాలన్నారు. తద్వార అధిక దిగుబడులు, రాబడులు సాధించి ఆర్థిక, సామాజిక, శాస్త్రీయ పరంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ఇప్పుడున్న ఉన్న యువత సాంకేతికంగా చాల చురుకుగా ఉన్నారని చెప్పారు. వారి నైపుణ్యం రైతుల పురోభివృద్ధికి తోడు కావాలని కోరారు. యవత దేశ పరంగా బాధ్యత యువతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శివశంకర్, శాస్త్రవేత్తలు డాక్టర్ మహేష్, డి శ్రీనివాస్, జె విజయ్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ కవిరాజ్, వంశీ పాల్గొన్నారు.

బ్లూ క్రాస్‌కు చేరిన పందెం కోడి



పందెం కోడిని అప్పగిస్తున్న అధికారులు

భగత్‌నగర్, జనవరి 12: ఆర్టీసీ బస్సులో దొరికిన పందెం కోడి బ్లూక్రాస్ చేరింది. ఆర్టీసీ అధికారులు ముందుగా శుక్రవారం బహిరంగవేలం నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ కమిటీ నిర్ణయం మేరకు వేలం రద్దు చేశారు. అనంతరం ఆ పందెం కోడిని బ్లూక్రాస్ సొసైటీ జంతు సంరక్షణ ఇన్‌చార్జి తూం నారాయణకు కోడిని అందజేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 12: కరీంనగర్ బస్టాండ్ రోడ్‌లోని తెలంగాణ మెడికల్ షాపు పక్కన శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని ఒకటో టౌన పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 45-50 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతుడు ధరించిన టీషర్ట్‌పై ఇండిగో పెయింట్స్ అని రాసిఉందని, గుర్తుపట్టిన వారు వన్‌టౌన్ సీఐ 8712670761, 9908440822లకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చ్యూరీ గదిలో భద్రపరిచామని పోలీసులు తెలిపారు.

వైభవంగా గోదాదేవి రంగనాయకుల కల్యాణం



స్వామి వారికి తలంబ్రాలు పోస్తున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

మెట్‌పల్లి, జనవరి, 12: పట్టణంలోని ఎస్సారెస్పీ క్యాంపులోని కోదండరామాల యంలో స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణాన్ని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంపతులు, కమిటీ నిర్వహకులు మహాజన్ నరసింహులు దంపతులు వైభంగా జరిపించారు. తిరుప్పావై ధరూర్ మాస మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఆలయం లోని స్వామి వారికి పురోహితులు రమాకాంత్ బృందం ప్రత్యేక అభిషేకాలు, పూ జలు, హారతి వంటి తదిర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఈఈ వెంకటేశ్వర్లు, ఈఈ అరుణ్‌కుమార్, శ్రీనివాస్, ఆర్మూర్ పోచయ్య, సుతారి బుచ్చిరాజు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణం పురోహితులు ఘనంగా జరిపారు. శుక్రవారం ఆలయంలోని ఉత్సవ మూర్తులకు పురోహితులు పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపి హారతి వంటి కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం పురోహితుల వేదమంత్రోచ్చారణల మధ్య గోదాదేవి రంగనాయకుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి కల్యాణం తిలకించడానికి మండలంలోని పలు గ్రామాల్లోని భక్తు లు పాల్గొని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అర్హులకు కేంద్ర పథకాలు అందాలి

- కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి అజయ్ గుప్తా



మల్కాపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అజయ్ గుప్తా, కలెక్టర్ అనురాగ్ జయంతి

కోనరావుపేట, జనవరి 12: అర్హులైన ప్రతీ ఒక్కరికి కేంద్ర ప్రభుత్వ పథకాలను అందించేందుకు వికసిత్ సంకల్ప యాత్ర కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, వికసిత్ సంకల్పయాత్ర జిల్లా నోడల్ అధికారి అజయ్ గుప్తా అన్నారు. కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామంలో శుక్రవారం వికసిత్ సంకల్ప్ యాత్రను ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను పరిశీలించారు. వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన డ్రోన్ ద్వారా వ్యవసాయం ఎలా చేయాలనే అంశంపై ప్రత్యక్షంగా డ్రోన్ ద్వారా వరి పొలాలపై పిచికారి చేస్తుండగా ఆయన కలెక్టర్‌తో కలిసి తిలకించారు. అనంతరం అజయ్ గుప్తా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎలాంటి వివక్ష లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఎంత మంది ప్రయోజనాలు పొందారు, ఎంతమందికి అందాయి అని తెలుసుకోవడం కోసమే ఈ యాత్రను నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఎలా అందుతున్నాయోనని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఈవో గౌతమ్‌రెడ్డి, డీఆర్‌డీవో రవీందర్, రామకృష్ణ సర్పంచ్ ఆరే లత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, జనవరి 12: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేములవాడకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామునే భక్తులు ఆలయ ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. అనంతరం క్యూలైన్‌లో ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకుని తరించారు. కాగా రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కులు చెల్లించకుని అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు సాయంత్రం తిరుగు పయాణమయ్యారు. కాగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని కేంద్ర టెక్స్‌టైల్ వంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి, వికసిత్ సంకల్పా యాత్ర జిల్లా నోడల్ అధికారి అజయ్‌గుప్తా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి వీచ్చేసిన ఆయనకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక దర్శనం అనంతరం మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వ దించగా ఆలయ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు, అల్లి శంకర్ స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

మద్యం మత్తులో ఎస్సైపై బీజేపీ నేత దురుసు ప్రవర్తన

జ్యోతినగర్, జనవరి 12: మద్యం మత్తులో సప్ప నాగరాజు అనే బీజేపీ నాయకుడు ట్రాఫిక్ ఎస్ఐపై దురుసుగా ప్రవర్తించడంతోపాటు దూషించిన సంఘటన గురువారం సాయంత్రం మేడిపల్లి సెంటర్‌లో జరిగింది. ట్రాఫిక్ ఎస్ఐ టి.ఉదయ్ కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం సప్ప నాగరాజు, మేకల నారాయణలపై ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మేడిపల్లి సెంటరులో రామగుండం ట్రాఫిక్ ఎస్ఐ ఉదయ్ కిరణ్ తన సిబ్బంతో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో బైక్‌పై వెళ్తున్న నాగరాజు, నారాయణలను ట్రాఫిక్ పోలీసులు ఆపారు. బ్రీత్ ఎనలైజర్‌లో ఊదాలని బైక్ నడుపుతున్న నాగరాజుకు పోలీసులు చెప్పినప్పటికీ నిరాకరించాడు. ఈ క్రమంలో ఎస్ఐ ఉదయ్‌కిరణ్‌తో పాటు డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ సిబ్బందపై నాగరాజు, నారాయణలు దురుసుగా వ్యవహరిస్తూ దూషించారు. ఈక్రమంలో సంఘటన స్థలానికి వచ్చిన ఎన్టీపీసీ ఎస్ఐ జీవన్ బీజేపీ నాయకుడు నాగరాజు, నారాయణలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనపై దురుసుగా ప్రవర్తించడం, దూషించడంతో పాటు తన విధి నిర్వహణను ఆటంకపరిచాడని ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఎన్టీపీసీ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. నాగరాజు, నారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జీవన్ తెలిపారు.

చైల్డ్ పోర్న్ వీడియోలు అప్‌లోడ్ చేసిన వ్యక్తి అరెస్టు

కోనరావుపేట, జనవరి 12: చైల్డ్ పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేసి ఫేస్‌బుక్ అకౌంట్‌లో అప్‌లోడ్ చేసిన వ్యక్తిని శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ కిరణ్ కుమార్ తెలిపారు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కిరణ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. కోనరావుపేట మండలం రామన్నపేట గ్రామానికి చెందిన మహమ్మద్ రజాక్ చైల్డ్‌పోర్న్ వీడియోస్ డౌన్‌లోడ్ చేసి ఫేస్‌బుక్‌లో అప్లోడ్ చేశాడు. హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ పోలీసు వారి సమాచారం మేరకు రజాక్‌పై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చైల్డ్ పోర్న్ వీడియోస్ అప్‌లోడ్ చేసినా, షేర్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లెల్లలో చైన్ స్నాచింగ్

తంగళ్లపల్లి, జనవరి 12: మండలంలోని జిల్లెల్లలో చైన్ స్నాచింగ్ జరిగింది. జిల్లెల్ల గ్రామానికి చెందిన రుద్రారపు పోచవ్వ ఆసుపత్రికి వెళ్లి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని జంట ద్విచక్ర వాహనంపై పోచవ్వకు లిఫ్ట్ ఇచ్చారు. పోచవ్వ ఇల్లు గ్రామ శివారులో ఉండగా మధ్యలో రేషన్‌షాప్ వద్దకు రాగానే బియ్యం తీసుకు వెళ్లాలి ఇక్కడే దింపేయమని కోరింది. వాహనం దింపివేసి ఒక్కసారిగా పోశవ్వ మెడలోని గొలుసును లాగేసుకొని మల్లాపూర్ వైపు పారిపోయినట్లు బాధితురాలు పోచవ్వ తెలిపింది. సుమారు మూడు తులాల బంగారు గొలుసు ఎత్తుకు వెళ్లినట్లు తెలిపింది. మల్లాపూర్ రేణుకా ఆలయం వద్ద సీసీ కెమెరాలో ద్విచక్ర వాహనంపై ఉన్న జంట కదలికలు రికార్డు అయినట్లు స్థానికులు చెప్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోచవ్వ తెలిపింది.

కవులు సామాజిక నిర్మాతలు



పురస్కారం అందుకున్న తోట నిర్మలారాణి

కరీంనగర్ కల్చరల్, జనవరి 12: ప్రజాపక్షం వహించే కవులు నవసమాజ నిర్మాతలని మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఫిలింభవన్‌లో పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 2024కుగాను అలిశెట్టి ప్రభాకర్ సాహిత్య పురస్కారాన్ని కవయిత్రి తోట నిర్మలారాణికి ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, అలిశెట్టి ప్రభాకర్ సతీమణి భాగ్యలక్ష్మి చేతులమీదుగా ప్రదానం చేశారు. తెవరే జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెరవే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కొండి మల్లారెడ్డి, బూర్ల వెంకటేశ్వర్లు, కవులు అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, అలిశెట్టి సంగ్రామ్, దామరకుంట శంకరయ్య, పీఎస్ రవీంద్ర, వెగ్గలం ఉషశ్రీ, కందుకూరి అంజయ్య, రామానుజం సుజాత, శ్రీనివాస్, పత్తెం వసంత, సరసిజ, నడిమెట్ల రామయ్య పాల్గొన్నారు.

విదేశాలకు పంపిస్తానని మోసం

కరీంనగర్ క్రైం, జనవరి 12: హాంగ్‌కాంగ్ పంపిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన కరీంనగర్‌లోని ఇండో అరబ్ కన్సల్టెన్సీ సంస్థకు చెందిన మినహాజ్ అలీ, రఫిక్‌అలంపై కేసు నమోదు చేశామని ఒకటో టౌన పోలీసులు తెలిపారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన గాజుల ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు. ఉపాధి కోసం విదేశాలకు వెళ్లేందుకు ఆంజనేయులు, మరో వ్యక్తితో కలిసి 2023న అక్టోబరులో కార్ఖనగడ్డలోని ఇండో అరబ్ కన్సల్టెన్సీ మినహాజ్ అలీ వద్దకు వెళ్లారు. హాంగ్‌కాంగ్‌కు వెళ్లేందుకు ఒక్కొక్కరికి రూ. 1.30 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పాడు. ఈ మేరకు ఆంజనేయులు రూ.1.10 లక్షలు, రాయుడు రూ. 1.20 లక్షలు ఇచ్చారు. మరో ఇద్దరిని కూడా హాంగ్‌కాంగ్‌కు పంపిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేశాడని బాధితుడు ఫిర్యాదు చేశాడు.

'హిందూ ధర్మ పరిరక్షణే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయం'

రాయికల్, జనవరి 12: హిందూ ధర్మ పరిరక్షణే ఆర్ఎస్ఎస్ ధ్యేయమని జిల్లా సహ శారీరక్ ప్రముఖ్ నూతికట్ల సత్యం అన్నారు. మండలంలోని ఇటిక్యాల గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సంక్రాంతి ఉత్సవాలు, వివేకానంద జయంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్రాంతి ప్రకృతిలో వచ్చే మార్పుల ఆధారంగా సూర్యుడు, ధనస్సు రాశి నుంచి మకర రాశిలో ప్రవేశించిన సందర్భంగా జరుపుకునే పండుగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖండ కార్యవాహ్ వేల్పుల స్వామి యాదవ్, కుర్మ మల్లారెడ్డి, దొంగ జితేందర్, సురేందర్, సుంకిశాల సత్యం, బయ్యని అంజి, లోకిని స్వామి, రొట్టె శ్రీధర్, గజభీంకార్ కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా కుడారై ఉత్సవం

రాయికల్, జనవరి 12: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో గల శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కుడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు జగన్మోహనాచార్యులు, రఘునాథ ఆచార్యులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. స్వామివారికి పాలతో చేసిన పాయసాన్ని నైవేద్యంగా స్టీల్ పాత్రలో నివేదించి భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బోడుగం మల్లారెడ్డి, సురకంటి నాగిరెడ్డి, అనుపురం చిన్న లింబాద్రి గౌడ్, కనపర్తి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే మార్నింగ్ వాక్

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



వేంపేట పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి రూరల్, జనవరి, 12 : నియోజక వర్గంలోని ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కారించేందుకే మార్నింగ్ వాక్ కార్యక్రమం చేపట్టినట్లు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వేంపేట గ్రామంలో ఉదయం కాలి నడకనతో తిరుగుతూ ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారికి అనుకొని 11కేవీ విద్యుత్ వైర్లతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు తెలుపగా విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కరించాలని సూచించారు. గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణం పనులను త్వరగా ప్రారంభించి నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. యూరియా కొతర ఉందని కొందరు రైతులు తెలపడంతో మార్క్‌ఫెడ్ డీఎమ్‌తో ఫోన్‌లో మాట్లాడి యూరియా కొరత తీర్చాలని కోరారు. ఎమ్మెల్యే వెంట వెంట నాయకులు ఎంపీటీసీ పుల్ల చంద్రశేఖర్‌గౌడ్, నల్ల తిరుపతిరెడ్డి, కొమ్ముల రాజేశ్వర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో భీమేష్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజు, కార్యదర్శి ప్రేమలత పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో కోరుట్ల మున్సిపాలిటీకి అవార్డు

కోరుట్ల, జనవరి 12 : కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో కోరుట్ల మున్సిపాలిటీ అవార్డు కైవసం చేసుకుంది. దేశంలోని అన్ని పట్టణాలతో పోటీపడి సౌత్ జోన్ క్లీనెస్ట్ సిటీగా 2023 సంవత్సరానికిగాను భారతదేశంలో ఆరవ స్థానం సొంతం చేసుకుంది. గత ఏడాది 2022లో ఫాస్టెస్ట్ మూవర్ సిటీగా అవార్డు పొంది మన్ననలు పొందింది. పురాతన కోనేరు (మెట్లబావి)కు ఇండిగ్లోబల్ అవార్డు కూడా సాధించింది. ఓడీఎఫ్ ప్లస్ సిటీగా గతంలో అవార్డు సంపాదించింది. అవార్డుల పరంపర కొనసాగిస్తున్న కోరుట్ల మున్సిపాలిటీ సిబ్బందికి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ అధికారులు, సిబ్బందిని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్యఅనిల్, వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, పారిశుధ్య సిబ్బందికి ఆర్‌డీఓ రాజేశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు.

చిరుత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 12 : మండలంలోని సత్యక్కపల్లె గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న చిరుతపులి కోసం అటవీశాఖాధికారులు శుక్రవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం గ్రామ శివారులోని జాతీయ రహదారిపై వెళ్తుండగా లారీ డ్రైవర్‌కు చిరుత కనిపించడంతో విషయం అధికారులకు తెలపడంతో ఫారెస్ట్ రేంజ్ అధికారి సౌకత్ అలి తన సిబ్బందితో వెళ్లి చిరుత సంచరించిన అటవీ ప్రాంతంలోని ఆనవాళ్లను పరిశీలించి అక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈయనతో నాయకులు నేరెళ్ల రాజాగౌడ్, డీఆర్‌వో మహ్మద్ హఫీజుద్దీన్, బీట్ అధికారి శివరాజ్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ గ్రామ సభలు

గొల్లపల్లి, జనవరి 12: గొల్లపల్లి మండలంలోని దమ్మన్నపేట, రంగదాముని పల్లి గ్రామాల్లో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గ్రామ సభలను అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుమారు 320 పథకాలను గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు తెలియజేశారు. దేశంలోని ప్రతి గ్రామంలో ఈ యాత్ర ఈ నెల 26 తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిల్కూరి అనసూయచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి మహేష్, అంగన్‌వాడీ సూపర్ వైజర్ మమత, ఏపీఎం త్రివేణి పాల్గొన్నారు.

'అభివృద్ధి చెందిన దేశంగా భారత్'

గొల్లపల్లి, జనవరి 12: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అగ్రపథాన నిలిచి అతి త్వరలో అభివృద్ధి చెందిన దేశంగా అవతరించబోతుందని గొల్లపల్లి మండల వికసిత భారత్ అంబాసిడర్, బీజేపీ జిల్లా నాయకులు ఈర్తి మధుకర్ యాదవ్ అన్నారు. మండలంలోని రంగదామునిపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన వికసిత భారత్ సంకల్ప యాత్రలో పాల్గొని మాట్లాడారు. అనంతరం మధుకర్‌కు గ్రామస్థులు, నాయకులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ అనంత రెడ్డి, గ్రామ కార్యదర్శి షరీఫ్, పలు శాఖల అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చైనా మాంజా దారం విక్రయిస్తే కఠిన చర్యలు

రాయికల్, జనవరి 12: సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలను ఎగురవేసే క్రమంలో ఉపయోగించే నైలాన్, సింథమిక్, గాజు పూత వేసిన చైనా మాంజా దారాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్‌ఆర్‌వో భూమేష్ అన్నారు. రాయికల్ పట్టణంలో శుక్రవారం పలు దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌వో మాట్లాడుతూ చైనా మాంజాలాంటి దారం వల్ల గాలిపటాలు ఎగురవేస్తే పక్షులకు, పర్యావరణానికి, మానవులకు హాని కలుగుతుందని, వీటి వలన తలెత్తే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. డిప్యూటీ రేంజ్ అధికారి పి.చంద్ర మౌళి, ఎఫ్‌ఎస్‌వో మల్లన్న, బీట్ అధికారులు రమణరెడ్డి, వసీంలు పాల్గొన్నారు.

'బీజేపీ నాయకుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

మెట్‌పల్లి రూరల్, జనవరి, 12 : మండలంలోని కొండ్రికర్ల గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ఆకుల శ్రీనివాస్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. బీజేపీ నాయకుడిపై జరిగిన దాడిని ఖండించి శుక్రవారం డీఎస్పీ రవీందర్‌రెడ్డిని వినతి పత్రం అందజేసి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, ఎంపీపీల ప్రోద్బలంతో బీజేపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడితే సహించేది లేదని దీనికి ప్రతిదాడి తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డి, మారు జనార్ధన్‌రెడ్డి, బోగ గంగాధర్, గంట రాజేశ్వర్, బొడ్ల రమేష్, సుఖేందర్‌గౌడ్, శ్రీధర్, మహేష్, రమేష్ పాల్గొన్నారు.

ఊరెళితే పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలి

కొడిమ్యాల, జనవరి 12 : మండలంలోని ప్రజలు ఇతర గ్రామాలకు వెళ్లేటప్పుడు పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని కొడిమ్యాల ఎస్సై కె. వెంకట్‌రావు సూచించారు. శుక్రవారం ఎస్సై విలేకరులతో మాట్లాడుతూ మీ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకొని నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. చుట్టు పక్కల ఇళ్ల వారికి సమాచారం అందించాలన్నారు. బంగారు ఆభరణాలు, నగదు, విలువైన వస్తువులను వెంట తీసుక పోవాలని సూచించారు. హోం అలారం సిస్టం ఏర్పాటు చేసుకుంటూ, వాహనాలను ఇంటి ఆవరణలో హ్యాండిల్ లాక్, వీల్ లాక్ చేసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై 100 డయల్ చేయాలన్నారు.

యువత వివేకానందుడి అడుగుజాడల్లో నడవాలి

●జడ్పీ చైర్‌పర్సన్ వసంత, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్
●జిల్లా కేంద్రంలో ఘనంగా వివేకానందుడి జయంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాల అర్బన్, జనవరి 12: యువత చేతిలోనే దేశ భవిత దాగి ఉందని, వివేకానందుడి అడుగుజాడల్లో నడవాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జిల్లా యువజన సర్వీసుల క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, డీబ్ల్యూవో భాస్కర్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ అనిల్ బాబు, కౌన్సిలర్ చుక్క నవీన్, డీవైఎస్‌వో రవికుమార్, డీఈ రాజేశ్వర్, మెప్మా ఏవో శ్రీనివాస్‌తో పాటు యువజన సంఘాల ప్రతినిధులు తదితరులున్నారు. అంతకు ముందు వివిధ భాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన అనంతరం, రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ కోచ్‌గా ఎంపికైన శ్రీరామ్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు.

●జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ హాజరై వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డీఆర్‌డీఏ పీడీ నరేష్, జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●స్వామివివేకానంద జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక విరూపాక్షి గార్డెన్‌లో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా 10గంటలకు లక్ష ఇరవై ఐదు వేల మంది యువతీ, యువకులతో సామూహిక ధ్యానం నిర్వహించామని, ఇందులో భాగంగా జగిత్యాలలో నిర్వహించామన్నారు.

●దేశ ఖ్యాతిని నలుదిశలా చాటిచెప్పిన వివేకానందుని జీవితం నేటి యువతకు స్పూర్తిదాయకం అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి అన్నారు. జిల్లా కేంద్రంలోని 45వ వార్డులో గల వివేకానందుని విగ్రహం వద్ద ఆయన జయంతిని పురస్కరించుకొని పూలమాల వేసి నివాళులు అర్పించారు.. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యాలయంలో స్వామివివేకానంద జయంతిని నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ రావు హాజరై నివాళులు అర్పించారు.

కొడిమ్యాల: యువత వివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలోని వివేకానందుని విగ్రహం వద్ద శుక్రవారం వివేకానంద సమితి ఆధ్వర్యంలో వివేకానందుని జయంతి వేడుకలను వివేకానంద సమితి వారు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివేకానందుని జయంతిని ప్రిన్సిపాల్ సంజీవయ్య ఆధ్వర్యంలో అధ్యాపకులు సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మమతనర్సింహరెడ్డి, ఎంపీ టీసీ రాజేశ్వరీరాజేందర్, ఆల్‌ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ రవికాంత్ పాల్గొన్నారు. తిప్పయ్యపల్లిలో వివేకానందుని జయంతి వేడుకలను గ్రామ సర్పంచు మ్యాకల లత మల్లేశం యాదవ్ నిర్వహించారు. మండల కేంద్రానికి శుక్ర వారం వచ్చిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యంను కొడిమ్యాల పట్టణ విశ్వబ్రాహ్మణులు(కర్రపని)శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా ప్రజా ప్రతినిధులు వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో దమ్మన్నపేట సర్పంచ్ పులిశెట్టి మల్లేశం, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఎంపీటీసీ తోడేటి గంగాధర్‌గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు సొల్లు భీమయ్య పాల్గొన్నారు.

కోరుట్ల: యువతకు ఎంతో స్పూర్తి ప్రదాతగా స్వామి వివేకానందుడు చరిత్రలో నిలిచిపోయారని ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ ప్రముఖ్ మురళి పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం బీజేపీ, బీజేవైఎం, ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వామి వివేకానందుని జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకుని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ జయశంకర్ పశువైద్య కళాశాలలో వివేకానందుని జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో పశువైద్యశాల అసోసియేట్ మాధవరావు, హరికృష్ణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్, కౌన్సిలర్ నరేశ్, సాయి, సాగర్ పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని భూపతిపూర్ గ్రామంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాయికల్ పట్టణంలో లయన్స్ క్లబ్, బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూపతిపూర్ గ్రామంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొమ్ముల ఆదిరెడ్డి, జడ్సి కాటిపెల్లి రాంరెడ్డి, డీసీ బత్తిని భూమయ్య, కోశాధికారి గంట్యాల ప్రవీణ్, లయన్స్ క్లబ్ సభ్యులు, బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, ప్రధాన కార్యదర్శి రవి, సర్పంచ్ చంద్రశేఖర్, సింగిల్ విండో చైర్మన్ ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

మెట్‌పల్లి : స్వామి వివేకానంద బోధనలు ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించాయని, ఆయన అడుగు జాడల్లో ఎన్నో దేశాలు నడుస్తున్నాయని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని ట్రస్మా ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ హౌట్ గెట్ ముందు నూతనంగా ఏర్పాటు చేసిన వివేకానంద విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. పట్టణంలోని పలు కళాశాలల్లో వివేకానంద జయంతి నిర్వహించారు. ఎంపీపీ మారు సాయిరెడ్డి, ట్రస్మా అధ్యక్షుడు దొంతుల రాజుకుమార్, సుఖేందర్‌గౌడ్, కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల, తాటిపెల్లిలో వివేకానందుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకుని మల్యాల బ్లాక్ చౌరస్తా, తాటిపెల్లిలో గల వివేకానంద విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మిట్టపెల్లి సుదర్శన్, పోతారం సింగిల్‌విండో చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు. నాయకులు మల్లేశం, సంతోష్, నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు మొగిలిపేట, సాతారం తదితర గ్రామాల్లో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గల వివేకానంద విగ్రహాలకు పూల మాలలు వేసినారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: గొల్లపల్లి మండల కేంద్రంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను వివేకానంద ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్ఎస్ఎస్ నాయకులు గుంటుకుల రమేష్ పాల్గొన్నారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు కట్ట మహేష్, కమిటీ నాయకులు శ్రీకోటి నీలకంఠం, చౌటపెల్లి రఘునందన్, శ్రీనివాస్, సురేష్, సందీప్ పాల్గొన్నారు.

కథలాపూర్ : మండలంలోని సిరికొండలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాంపల్లి శ్రీధర్, గాంధారి శ్రీనివాస్, కాశోజీ ప్రతాప్ ఉన్నారు.

బీర్‌పూర్: బీర్‌పూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.



కోరుట్లలో పూలమాల వేస్తున్న బీజేవైఎం నాయకులు



మల్యాలలో పూలమాలలు వేస్తున్న ప్రజాప్రతినిధులు



మెట్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



కొడిమ్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

ఖాదీపై రాజకీయ ఆరోపణలు సరికాదు

ఖాదీ మెంబర్ ఆఫ్ కార్యదర్శి సాంబయ్య



మున్సిపల్ మంత్రికి అర్జీ పెట్టుకున్న పత్రం చూపుతున్న సాంబయ్య

మెట్‌పల్లి, జనవరి, 12 : గాంధీ సిద్ధాంతంతో నిర్వహిస్తున్న ఖాదీపై రాజకీయాల కోసం అసత్య ఆరోపణలు చేయడం సరికాదని మెంబర్ ఆఫ్ కార్యదర్శి సాంబయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఖాదీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెట్‌పల్లి మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెతో ఖాదీపై అసత్య ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. ఖాదీ బోర్డులు తెలంగాణలో రెండు ఉన్నాయని, అందులోని మెట్‌పల్లిలో జరుగుతున్న నూతన షాపింగ్‌ల నిర్మాణానికి గతంలో ఉన్న మున్సిపల్ మాజీ మంత్రి కేటీఆర్‌తో అనుమతి చార్జీలను తగ్గించాలని అర్జీ పెట్టుకోవడంతో ఇచ్చిన హామీ పత్రాన్ని చూపించారు. పట్టణంలోని ఖాదీ బోర్డు స్థలంలో కూరగాయాల మార్కెట్ పెట్టుకోవడానికి లీజుకు ఇవ్వాలని మున్సిపల్ వారు తీర్మానం చేయడంతో మాజీ ఎమ్మెల్యే, బోర్డు చైర్మన్ ఇచ్చారన్నారు. మున్సిపల్‌కు రూ. 51లక్షలు చెల్లించాల్సి ఉండగా ఈ నెల 11న రూ. 13లక్షలు చెల్లించామన్నారు. మిగిలిన వాటిని మున్సిపల్‌కు లీజుకు ఇచ్చిన స్థలానికి చెల్లించాల్సిన బకాయితో పాటు మరో 150 షాపింగ్‌లకు పర్మిషన్‌కు సర్ది చేస్తామని చెప్పామన్నారు. రాజకీయాల కోసం అక్రమాలు జరిగినట్లు అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మెంబర్ నారాయణ, జనరల్ మేనేజర్ మాధవ్, వెంకటేశ్వర రాజు, లక్ష్మణ్, వెంకటరాణి, బాలరాజు, గోపి, పరమేశ్వరరావు, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మల్యాల: నూకపల్లి మోడల్‌స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.సరితాదేవి తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంకు గాను 100 సీట్ల ప్రవేశానికి అలాగే 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశం పొందడానికి దరఖాస్తులు ప్రారంభం అయ్యాయని ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చునని అన్నారు. ఎప్రిల్ 7న ఉదయం 10 గంటలకు 6వ తరగతి ప్రవేశ పరీక్ష, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 7 నుంచి పదవ తరగతిలో ఖాళీ సీట్లకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

కోరుట్ల: ఈ నెల 22 దాకా ఓటరుగా నమోదు చేసుకోడానికి అవకాశం ఉందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీనారాయణ కోరారు. శుక్రవారం పట్టణంలోని నంది చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ దాకా కళాజాత బృందంతో ప్రచారం నిర్వహించారు. జిల్లా స్వీప్ కమిటీ సభ్యుడు సిరిసిల్ల శ్రీనివాస్, ఆర్‌డీఓ రాజేశ్వర్, కళాకారులు అశోక్, పరుశురాం, మల్లిక్ ఉన్నారు.

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, ఊట్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం ఐసీడీఎస్ అధికారులు వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక సంకల్ప యాత్ర గురించి అవగాహన కల్పించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచులు సులోచన, స్వామి, పశువైద్యాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ గ్రామంలో శుక్రవారం స్వామివివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్యాక్స్ చైర్మన్ జోగినిపెల్లి సందీప్‌రావు, సర్పంచ్ మహేశ్వర్‌రావు, ఎంపీటీసీ పరశురాంగౌడ్ పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బుర్రగడ్డ శివకుమార్ మృతదేహాన్ని కరీంనగర్ నుంచి అంబులెన్స్ ద్వారా స్వగ్రామానికి పంపించి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మానవత్వం చాటుకున్నారు.

కొడిమ్యాల: రైతులు వ్యవసాయ మోటర్లకు కెపాసీటర్లను అమర్చుకోవాలని లైన్‌మెన్ రాజనర్సయ్య కోరారు. శుక్రవారం మండలంలోని నాచుపెల్లి గ్రామంలో లైన్‌మెన్ కెపాసీటర్ల వలన కలుగు పలు ప్రయోజనాలపై రైతులకు అవగాహన కలిపించారు.

ఎండపల్లి: మండలంలోని ఎండపల్లి గ్రామానికి చెందిన ఎంపీటిసి ఎండి బషీర్ తల్లి వౌజబి మంగళవారం రోజున అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం రోజున మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, సర్పంచ్ మారం జెలెందర్ రెడ్డి, గాజుల మల్లేశం, మల్యాళ్ళ గంగారంపాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ మండలంలోని ఇటిక్యాల, మైతాపూర్ గ్రామంలో మామిడి తోటలను హార్టికల్చర్ అధికారి స్పందన శుక్రవారం పరిశీలించారు. మామిడి తోటలో ఏర్పడిన తెగుళ్లు, పూత సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. వీరి వెంట ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

●ఇటీవల నిర్వహించిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో విడుదల చేసిన ఓటరు లిస్టును సవరించాలని కోరుతూ రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషాకు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన ఓటరు జాబితాలో పట్టణంలోని కొన్ని ఓట్లు వార్డులవారీగా నమోదు కాలేవన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పట్టణంలోని 12 వార్డుల ఓటరు జాబితా ఇంటి నెంబర్ల ప్రాతిపదికన సిద్ధం చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫంక్షన్ హాల్ సీజ్



ఫంక్షన్‌హాల్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కోరుట్ల, జనవరి 12 : మూడు విడతల్లో ఫీజు చెల్లిస్తానని ఒప్పందం కుదుర్చుకుని నోటీసులు జారీ చేసినా నిర్మాణ ఫీజు చెల్లించని ముక్కాస్ ఫంక్షన్ హాల్ (కన్వెన్షన్)ను శుక్రవారం మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. కోరుట్ల - మెట్‌పల్లి రోడ్డు వెంట ఉన్న ముక్కాస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ముక్క చిన్నధర్మరాజు, ముక్క శైలజలు అనుమతులు తీసుకున్నారు. దీనికిగాను మూడు విడతలుగా ఫీజు చెల్లిస్తానని ఒప్పందం కుదుర్చుకున్నారు. మూడవ విడత ఫీజు చెల్లించాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించారని అధికారులు తెలిపారు. స్పందించకపోవడంతో ఉన్న తాధికారుల ఆదేశాల మేరకు ఫంక్షన్ హాల్ సీజ్ చేశామని అధికారులు తెలిపారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

మల్యాల, జనవరి 12: మల్యాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. ఎంపీపీ మిట్టపల్లి విమల అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో అధికారులు తమ ఎజెండ చదవడానికే పరిమితం కాగ సభ్యులు ప్రజా సమస్యలపై పట్టించుకున్నట్లు లేదు. గంటలోపే సమావేశం ముగించారు. గ్రామాల్లో కుక్కల బెడద ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని చర్యలు తీసుకోవాలని పోతారం ఎంపీటీసీ సభ్యుడు కొల్లూరి గంగాధర్ సమావేశం దృష్టికి తెచ్చారు. బల్వంతాపూర్, రామన్నపేట గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సింగిల్‌విండో చైర్మన్ రాంలింగారెడ్డి, ఎంపీటీసీ సంగని రవి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎం.డీ అజర్ ఆర్టీసీ అధికారులను కోరారు. వరదకాలువ మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని, తరలించిన చోట ఖాళీ అయిన స్థలాలు అన్యాక్రంతం అవుతున్నాయని చర్యలు తీసుకోవాలని సింగిల్‌విండో చైర్మన్ రాంలింగారెడ్డి ఇరిగేషన్ అధికారులను కోరారు. సమావేశం మధ్యలోనే వైస్ ఎంపీపీ పోతాని రవి, ఎంపీటీసీలు రవళీ, అనిత, సంజన, వనిత, సఫీయాబేగం, గంగాధర్, రవి సమావేశం నుంచి వెళ్లిపోయారు. కాసేపటికి గంగాధర్, రవి మళ్లీ వచ్చి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వెంకటేశం, సీడీపీవో నర్సింగరాణీ, ఇరిగేషన్ డీఈ తిరుపతి మండల అధికారులు పాల్గొన్నారు. మండల స్థాయి అధికారులు సగానికి పైగా సమావేశానికి గైర్హజరవడం పట్ల సభ్యులతో పాటు ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు కాని అధికారుల వివరాలు కలెక్టర్ దృష్టికి తీసుకెళలతామని పేర్కొన్నారు.

ఇంకెన్నాళ్లీ ఇన్‌చార్జి పాలన

బీసీ స్థానంలో ఇన్‌చార్జి ఎంపీపీగా ఓసీ వ్యక్తి



ఎంపీడీవోకు వినతి పత్రం అందిస్తున్న ఎంపీటీసీలు (ఫైల్‌ఫొటో)

జగిత్యాలరూరల్, జనవరి 12 : జగిత్యాల రూరల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఎంపీపీగా ఇంకెన్నాళ్లు ఇన్‌ఛార్జీ పాలనను కొనసాగిస్తారని బీసీలు, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల రూరల్ ఎంపీపీ గాజర్ల గంగారాంగౌడ్ 2021 ఏప్రిల్ 29న కరోనాతో మృతిచెందాడు. దీంతో ఆపదవిని వైస్ఎంపీపీ (జన రల్) రాజేంద్రప్రసాద్‌కు కట్టబెట్టారు. దీంతో బీసీలు తమ రిజర్వేషన్ స్థానంలో జనరల్ వ్యక్తికి అప్పగించడం ఏంటని చాలా కాలంగా ఆగ్రహంతో ఉన్నారు. గత సంవత్సరంలో మేలో నిర్వహించిన రూరల్ మండల సర్వసభ్య సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీపీ స్థానంలో బీసీ వ్యక్తిని ఎంపీపీగా ఎన్నుకోవాలని కోరుతూ మెజార్టీ ఎంపీటీసీలు కలెక్టర్‌కు, జగిత్యాల రూరల్ ఎంపీడీవో రాజేశ్వరికి వినతి పత్రం అందజేశారు. అయినా ఫలితం లేకుండా పోయిందని ఎంపీటీసీలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే నిర్వహించిన జగిత్యాల రూరల్ మండల సర్వసభ్య సమావేశాలకు సైతం మండల సభ్యులు హాజరు కావడంలేదు. దీంతో కోరం లేకపోవడంతో మండలసమావేశాన్ని రూరల్ ఎంపీడీవో రాజేశ్వరి వాయిదా వేశారు. ఇలా తరచూ ఎంపీటీసీలు, సర్పంచులు ఏదో ఒక రూపంలో తమ వాదనను గట్టిగానే వినిపిస్తూ తమ నిరసనగళాన్ని బహిరంగంగానే వ్యక్తపరుస్తున్నారు. అయినప్పటికీ ఆ దిశగా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఇది ఇలా ఉంటే గురువారం రూరల్ ఎంపీపీ అధ్యక్షస్థానానికి ఎన్నిక నిర్వహించాలని కోరుతూ ప్రస్తుత ఇన్‌చార్జి ఎంపీపీ రాజేంద్రప్రసాద్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. తాను కొనసాగుతున్న ఎంపీపీ పదవికి రాజీనామా చేయకుండానే ఎన్నిక నిర్వహించాలని కోరడం రాజకీయ కోణంలో భాగమేనని పలువురు చర్చించుకుంటున్నారు. ఏదైనా అనివార్యకారణాల వల్ల పదవిలో ఉన్న వ్యక్తి మరణిస్తే ఆ స్థానంలో ఆరు నెలలలోపు ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. కాని రెండున్నరేళ్లు గడుస్తున్న బీసీకి కేటాయించిన రూరల్ఎంపీపీ స్థానంలో ఇన్‌చార్జి ఎంపీపీగా ఓసీ వ్యక్తిని కొనసాగించడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి. వెంటనే అధికారులు చొరవ తీసుకొని జగిత్యాల రూరల్ ఎంపీపీ స్థానానికి ఎన్నిక నిర్వహించి స్థానాన్ని అర్హులైన బీసీ వ్యక్తికి కేటాయించాలని మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.